కళ్లకుర్చిలో 57కు పెరిగిన మృతుల సంఖ్య

ప్రాణాపాయ స్థితిలో మరో 25 మంది

మాధవరం నుండి మెథనాల్ సరఫరా?



ఆగని మరణమృదంగం



మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

చెన్నై, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): కళ్లకుర్చి జిల్లా కరుణాపురంలో మరణమృదంగం వినిపిస్తూనే వుంది. రోజు రోజుకు మృతుల సంఖ్య పెరిగిపోతూనే వుంది. తాజాగా కల్తీసారాకు బలైనవారి సంఖ్య 57కు పెరిగింది. ఈనెల 18న కల్తీసారా తాగి రెండు వందలమందికి పైగా తీవ్ర అస్వస్థతకు గురై విల్లుపురం, కళ్లకుర్చి, సేలం ప్రభుత్వ ఆసుపత్రుల్లో, పుదుచ్చేరి జిప్మర్ ఆసుపత్రిలో చికిత్సలు పొందారు. గురువారం వరకూ 43 మంది చికిత్స ఫలించక ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో సేలం, కళ్లకుర్చి ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన నాగపిళ్లై (39), బాలు (50), శ్రీధర్ (40), సోలైముత్తు (65), వావుసి నగర్ రాజేంద్రన్ (60), కోట్టైమేడుకు చెందిన రాజేంద్రన్ (55), కోవై రాజా (35), మాదచ్చేరి వీరముత్తు (33), కళ్లకుర్చి మణికంఠన్ (28), పరమశివం(58) కళ్యాణసుందరం (42), ఉత్తరాది రాష్ట్రానికి చెందిన పానీపూరీ వ్యాపారి సహా 12 మంది మృతిచెందారు. దీంతో మృతుల సంఖ్య 55కు పెరిగింది. శనివారం మధ్యాహ్నం సారా తాగి ఇంటిపట్టునే గడిపిన మరో ఇద్దరు ప్రాణాలు కోల్పోవడంతో మృతుల సంఖ్య 57కు చేరింది. ప్రస్తుతం కళ్లకుర్చి ఆసుపత్రిలో 83 మంది, సేలం ప్రభుత్వ ఆసుపత్రిలో 31 మంది, విల్లుపురం ప్రభుత్వ ఆసుపత్రిలో ఇద్దరు, పుదుచ్చేరి జిప్మర్ ఆసుపత్రిలో 17 మంది, ప్రైవేటు ఆసుపత్రులలో మరికొంతమంది చికిత్సలందుకుంటున్నారు. ఇందులో మరో 25 మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

చెన్నై నుంచే మెథనాల్ సరఫరా?

కళ్లకుర్చిలో 57 మంది మృతికి కారణమైన సారాలో కలిపిన మెథనాల్ చెన్నై మాధవరం ఫ్యాక్టరీ నుంచి సరఫరా అయినట్లు పోలీసు ఉన్నతాధికారుల విచారణలో వెల్లడైంది. పుదుచ్చేరి తదితర ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన సారా ప్యాకెట్లలో మెథనాల్‌ను అధిక మోతాదులో కలపటం వల్లే తాగిన వారంతా తీవ్ర అస్వస్థతకు గురైనట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశం మేరకు పోలీసులు కళ్లకుర్చి ప్రాంతానికి మెథనాల్ ఎక్కడి నుంచి సరఫరా అయ్యిందనే విషయంపై ముమ్మర దర్యాప్తు జరుపుతూ వచ్చారు. ఈ నేపథ్యంలో మెథనాల్ మాధవరంలోని ఓ టర్పెన్‌టైన్ తయారీ ఫ్యాక్టరీ నుంచి సరఫరా అయినట్లు గుర్తించారు. సారా వ్యాపారులు ఆన్‌లైన్ ద్వారా మాధవరం ఫ్యాక్టరీలో మెథనాల్ లభిస్తుందని తెలుసుకుని దాన్ని 'తిన్నర్' అనే పేరుతో జీఎస్టీ పన్ను కూడా లేకుండా నకిలీ బిల్లులతో కొనుగోలు చేసినట్లు సీబీసీఐడీ విచారణలో తెలిసింది. ఈ మెథనాల్‌ను నిందితుడు మాదేష్ నుంచి గోవిందరాజ్ కొనుగోలు చేసినట్లు తేలింది. తొలుత కళ్లకుర్చి వ్యాపారులు లీటర్ మెథనాల్‌కు లీటర్ మంచినీటిని కలిపి విక్రయించారు. అయితే ఆ సారా తాగితే మత్తు రావడం లేదని కొందరు ఆగ్రహం వ్యక్తం చేయడంతో వ్యాపారులు లీటర్ మెథనాల్‌కు అరలీటర్ మంచినీటిని కలిపి విక్రయించారు. ఈ కారణం వల్లే ఆ సారా తాగిన వెంటనే అందరూ అస్వస్థతకు గురయ్యారని సీబీసీఐడీ పోలీసులు తెలిపారు.

ముగ్గురిపై హత్య కేసు...

కళ్లకుర్చి కల్తీసారా దుర్ఘటనకు సంబంధించి ఇప్పటి వరకూ ఎనిమిది మందిని అరెస్టు చేశారు. వీరిలో చిన్నదురై, జోసెఫ్ రాజా, రామర్ అనే ముగ్గురిపై కచ్చిరాపాళయంల పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ ముగ్గురే సారాలో మెథనాల్‌ను ఎక్కువ మోతాదులో కలిపినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసుకు సంబంధించి పరారీలో ఉన్న వారి ఆచూకీ కోసం గాలిస్తున్నామని తెలిపారు.

పానీపూరీ కార్మికుడి మృతి...

కళ్ళకుర్చి దుర్ఘటనలో ఉత్తర ప్రదేశ్‌కు చెందిన జితేందర్ (40)అనే పానీ పూరీ దుకాణ కార్మికుడు కూడా మృతిచెందాడు. ఈ నెల 18న దుకాణం యజమాని వద్ద రూ.200 నగదుతో రెండు మూడు ప్యాకెట్ల సారా తాగాడు. సాయంత్రం దుకాణం వద్దకు వెళ్లగానే వాంతులయ్యాయి. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం కళ్లకుర్చి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చివరకు శనివారం వేకువజాము చికిత్స ఫలించక మృతి చెందాడు.

ముగ్గురు సారా వ్యాపారులపై హత్య కేసు

అడయార్: కళ్ళకుర్చి కల్తీ సారా విషాద ఘటనకు బాధ్యులైన ముగ్గురు సారా వ్యాపారులపై జిల్లా పోలీసులు హత్య కేసును నమోదు చేశారు. సారాను విక్రయించిన కన్నుకుట్టి అలియాస్ గోవిందరాజ్, ఈయన భార్య విజయ, ఆమె సోదరుడు దామోదరన్‌ను కచ్చిరపాళెయం పోలీసులు ఇప్పటికే అరెస్టు చేయగా, వారిపై హత్య కేసును నమోదు చేశారు.

సారా వ్యాపారులపై ఉక్కుపాదం

కలెక్టర్లకు సీఎం స్టాలిన్ ఆదేశం ● రాష్ట్రవ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు ● 876 మంది అరెస్ట్



చెన్నై, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సారా వ్యాపారులను ఉక్కుపాదంతో అణచివేయాలని, ఆ దుండగులు ఏ పార్టీకి చెందినవారైనా వెనుకాడకుండా కఠిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమయ్యారు. ఈ నేపథ్యంలో సీఎం శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సారా వ్యాపారులను, వారికి అన్ని విధాల సహకరిస్తున్న రాజకీయ నేతలు, ప్రజా ప్రతినిధులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు.సారా విక్రయాలకు సంబంధించిన పాత కేసుల దుమ్ముదులిపి నేరస్తులపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. అంతేకాకుండా సారా వ్యాపారుల వెనుక ఉన్న బడా నేతలెవరో కనుగొని వారిపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని, కళ్ళకుర్చి దుర్ఘటనలు ఇకపై పునరావృతం కాకుండా పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు సమన్వయంతో తరచూ ముమ్మర తనిఖీలు కూడా జరపాలని స్పష్టం చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు

సీఎం స్పష్టమైన ఆదేశాల నేపథ్యంలో ఎక్సైజ్ విభాగ పోలీసులు రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు చేపడుతున్నారు. ఉత్తర జిల్లాల్లో మాత్రమే 876 మంది సారా వ్యాపారులను అరెస్ట్ చేశారు. అడవులు, కొండ ప్రాంతాలు, జనసంచారం లేని ప్రాంతాలు, ముఖ్యంగా సారా తయారు చేసే బట్టీలు వద్దకు పోలీసు బృందాలు చేరుకొని, కడలూరు, విల్లుపురం, కళ్లకుర్చి, సేలం, కాంచీపురం, తిరువణ్ణామలై, తిరువళ్లూర్, చెంగల్పట్టు తదితర 8 జిల్లాల్లో శనివారం ఉదయం వరకు 876 మంది సారా వ్యాపారులను అరెస్ట్ చేశారు. ఇదికాకుండా, 4,657 లీటర్ల సారాను ధ్వంసం చేశారు.

తిరుచ్చి జిల్లాలో...

తిరుచ్చి జిల్లా దురైయూర్ తాలూకా, పచ్చమలై సమీపంలో పోలీసులు జరిపిన ఆకస్మిక దాడుల్లో 250 లీటర్ల సారాను గుర్తించి ధ్వంసం చేశారు. పచ్చమలైలో జిల్లా ఎస్పీ ప్రదీప్ కుమార్, ఎస్పీ వరుణ్ కుమార్, ఇతర పోలీస్ ఉన్నతాధికారులు శుక్రవారం రాత్రి దాడులు నిర్వహించారు. అదేవిధంగా నాగపట్టినం జిల్లాలో రెండు రోజుల క్రితం పోలీసులు, అబ్కారీ శాఖ సిబ్బంది తనిఖీల్లో వెయ్యి లీటర్ల సారాని స్వాధీనం చేసుకుని 15 మందిని అరెస్టు చేశారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న సారా పుదుచ్చేరిలో తయారైనట్టు గుర్తించారు.



మెరీనా బీచ్ సర్వీస్ రోడ్డులో వాహన తనిఖీల్లో పోలీసులు

కళ్లకుర్చి ఘటనపై నిరసనలకు యత్నం

● మోహరించిన పోలీసులు
● సందర్శకుల తనిఖీలు

ప్యారీస్, జూన్ 22: కళ్లకుర్చి కరుణాపురంలో కల్తీ సారా దుర్ఘటనను ఖండిస్తూ మెరీనా బీచ్‌లో వివిధ సంస్థలు శనివారం ఆందోళన చేపట్టేందుకు యత్నించాయి. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో పొక్కడంతో అప్రమత్తమైన గ్రేటర్ చెన్నై పోలీసులు మెరీనా ప్రాంతంలో ఆంక్షలు విధించడంతో పాటు భద్రత కట్టుదిట్టం చేశారు. మైలాపూర్ ఆలిండియా రేడియో సమీపంలో ఉన్న లైట్ హౌస్ నుంచి దివంగత ముఖ్యమంత్రులు అన్నాదురై, ఎంజీఆర్, జయలలిత, కరుణానిధి స్మారక మందిరాలు, సమీపంలో ఉన్న నేపియర్ వంతెన వరకు సుమారు 200 మందికి పైగా పోలీసులు మోహరించారు. ఈ ప్రాంతాన్ని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. మెరీనా బీచ్‌లో సేదతీరేందుకు ఐదుగురికి పైగా రాకూడదని హెచ్చరించారు. అలాగే, సర్వీస్ రోడ్డు, స్విమ్మింగ్ పూల్, వివేకానంద హౌస్ ప్రాంతాల్లో ఆందోళన నిర్వహించేందుకు ఎవరికీ అనుమతి లేదని హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. కళ్లకుర్చి దుర్ఘటనకు సంబంధించి ఆందోళన చేపట్టదలచిన వారు అనుమతులు పొంది, కేటాయించిన ప్రాంతాల్లో మాత్రమే నిరసన తెలియజేయాలని, దీనిని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. శ్రామికుల విగ్రహం, నేతల స్మారక మందిరాల వద్ద పోలీసులు పెద్దసంఖ్యలో మోహరించారు.

కళ్లకుర్చి కల్తీసారా దుర్ఘటనపై ఆగ్రహం

అసెంబ్లీ నుంచి అన్నాడీఎంకే సభ్యుల వాకౌట్

చెన్నై, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): కళ్లకుర్చి సారా దుర్ఘటనకు బాధ్యత వహించి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ రాజీనామా చేయాలని ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే రెండో రోజూ అసెంబ్లీలో పట్టుబట్టింది. ఈ సంఘటనపై తక్షణమే సభలో చర్చకు అనుమతించాలని స్పీకర్ అప్పావుపై తీవ్ర ఒత్తిడి చేసింది. శుక్రవారం ఉదయం ప్రశ్నోత్తరాల సమయంలో అన్నాడీఎంకే సభాపక్ష నాయకుడు ఎడప్పాడి పళనిస్వామి, ఆ పార్టీ సభ్యులంతా లేచి స్పీకర్ పోడియాన్ని చుట్టుముట్టి సీఎం రాజీనామా చేయాలని ప్లకార్డులతో ప్రదర్శన జరిపారు. స్పీకర్ అప్పావు ప్రశ్నోత్తరాల సమయం ముగిసిన తర్వాత కళ్లకురిచ్చి సంఘటనపై మాట్లాడేందుకు అనుమతిస్తామని చెప్పినా పట్టించుకోకుండా బైఠాయించారు. దీంతో స్పీకర్ వారందరిని మార్షల్స్ చేత గెంటివేయించారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం కూడా అన్నాడీఎంకే సభ్యులంతా కళ్లకుర్చి మృతులకు సంతాపం తెలియజేసేలా నల్ల చొక్కాలు ధరించి అసెంబ్లీకి వచ్చారు. సభలో ప్రశ్నోత్తరాల సమయం ప్రారంభమవుతున్న సమయంలో ఈపీఎస్ నాయకత్వంలో అన్నాడీఎంకే సభ్యులంతా లేచి కళ్లకుర్చి దుర్ఘటనపై మాట్లాడేందుకు అనుమతించాలని పట్టుబట్టారు. స్పీకర్ జోక్యం చేసుకుని సభలో ప్రశ్నోత్తరాల సమయం తర్వాతే ఏ విషయాన్నైనా చర్చించవచ్చని, అంతదాకా ఓర్పు వహించాలని కోరారు. అయితే స్పీకర్ మాటలను పట్టించుకోకుండా అన్నాడీఎంకే సభ్యులంతా మూకుమ్మడిగా లేచి మాట్లాడేందుకు అనుమతించాలని చేసిన డిమాండ్‌ను స్పీకర్ నిరాకరించారు. స్పీకర్ నిర్ణయాన్ని ఖండిస్తూ సభ నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ఈపీఎస్ ప్రకటించారు.

సీబీఐతోనే విచారణ జరపాలి...

కళ్లకుర్చి సారా దుర్ఘటనపై ప్రభుత్వం విచారణ జరిపితే వాస్తవాలు మరుగవుతాయని, సీబీఐతోనే విచారణ జరపాలని అన్నాడీఎంకే సభాపక్షనాయకుడు, మాజీ సీఎం ఈపీఎస్ డిమాండ్ చేశారు. శాసనసభ నుంచి వాకౌట్ చేసిన మీదట సచివాలయం వెలుపల విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. కళ్లకుర్చిలో కల్తీ సారా తాగి సుమారు రెండువందల మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారని, ఇప్పటివరకూ 57 మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. ఇంతటి దారుణమైన దుర్ఘటన గురించి శాసనసభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న తనను మాట్లాడేందుకు స్పీకర్ అనుమతించకపోవడం గర్హనీయమన్నారు. శాసనసభలో కీలకమైన అంశం గురించి మాట్లాడే హక్కు ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకేకు ఉందని, ప్రశ్నోత్తరాల సమయం ముగిసిన తర్వాత లేదా జీరో అవర్‌లో మాట్లాడేందుకు అనుమతిస్తానని స్పీకర్ తమను మాట్లాడనీయకుండా చేస్తున్నారని విమర్శించారు. కల్తీసారా తాగినవారికి తక్షణ చికిత్సగా ఇచ్చే హోమీ పిజోల్ అనే మందులు కొరతగా ఉన్నాయని తాను చెబితే ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణ్యం అల్సర్‌కు వాడే ఓమ్రీపిజోల్ ప్రభుత్వ ఆసుపత్రులలో స్టాకు ఉందని చెబుతున్నారని పేర్కొన్నారు. తాను చెప్పిన సూదిమందు కళ్లకుర్చి పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆసుపత్రులలో లేనే లేవని చెప్పారు. సారా విక్రయాల్లో డీఎంకేకు చెందిన ఇద్దరు కౌన్సిలర్లకు సంబంధాలు ఉన్నాయని, అక్కడి ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. సారా వ్యాపారంలో డీఎంకే శాసనసభ్యుడికి కూడా వాటా ఉందని కూడా చెబుతున్నారని తెలిపారు. డీఎంకే కౌన్సిలర్లు, శాసనసభ్యుడి వద్ద సీబీసీఐడీ పోలీసులు విచారణ జరిపేందుకు వెనుకాడుతున్నారని, కనుకనే తాను సీబీఐ విచారణ కోరుతున్నానని ఈపీఎస్ చెప్పారు. ఈ విషయమై తమ పార్టీ హైకోర్టులో కేసు దాఖలు చేసిందన్నారు.



అసెంబ్లీ నుంచి వాకౌట్ చేస్తున్న ఎడప్పాడి పళనిస్వామి, ఆ పార్టీ శాసనసభ్యులు

మా వినతులను పరిశీలించండి

● నిర్మలమ్మకు మంత్రి తంగం తెన్నరసు వినతి



కేంద్ర విత్తమంత్రి నిర్మలా సీతారామన్‌తో మంత్రి తంగం తెన్నరసు

చెన్నై, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): త్వరలో ప్రవేశపెట్టనున్న పూర్తిస్థాయి వార్షిక బడ్జెట్‌లో వివిధ అభివృద్ధి పథకాలకు నిధులు కేటాయించాలని కేంద్రం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను రాష్ట్ర ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు కోరారు. కేంద్రంలో కొత్తగా కొలువుదీరిన బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం 2024-25 సంవత్సరానికి వార్షిక బడ్జెట్‌ను త్వరలోనే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనుంది. ఈ బడ్జెట్ రూపకల్పనలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఆ శాఖ ఉన్నతాధికారులు నిమగ్నమై ఉన్నారు. ఇందులోభాగంగా, వివిధ రంగాలకు చెందిన నిపుణులతో పాటు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన ఆర్థిక మంత్రులతో విత్తమంత్రి నిర్మలా సీతారామన్ వరుస సమావేశాలు నిర్వహిస్తూ సూచనలు, సలహాలు స్వీకరిస్తున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి తంగం తెన్నురసు, ఆ శాఖ కార్యదర్శి ఉదయచంద్రన్, ఇతర ఉన్నతాధికారులు ఢిల్లీకి వెళ్ళి ఆర్థిక మంత్రిని కలిసి, బడ్జెట్‌లో తమ రాష్ట్రానికి కేటాయించాల్సిన వివిధ అంశాలకు సంబంధించి వినతిపత్రాన్ని సమర్పించారు. ఇందులో ప్రధానంగా మెట్రో రైల్ ప్రాజెక్టు రెండో దశ నిర్మాణ పనులు అనుమతి ఇవ్వడంతో పాటు నిధులను కేటాయించాలని కోరారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన బాధిత ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల రూపకల్పనకు రూ.3 వేల కోట్లను కేంద్రం ఇవ్వాలని కోరారు. కేంద్రప్రభుత్వ పథకాల్లో కనిష్ఠంగా 50 శాతం నిధులను కేంద్రం ఇవ్వాలని మంత్రి తంగం తెన్నరసు కోరారు. ముఖ్యంగా తాంబరం - చెంగల్పట్టు ప్రాంతాల మధ్య నాలుగో లైను రైలు మార్గం, తిరుపత్తూరు - కృష్ణగిరి - హోసూర్ ప్రాంతాల మధ్య కొత్త రైల్వే మార్గం, అరుప్పుకోట్టై మీదుగా మదురై - తూత్తుకుడి మధ్య 143.5 కిలోమీటర్ల మార్గం నిర్మాణం, మీంజూరు - తిరువళ్లూరు - శ్రీపెరుంబుదూరు - ఓరగడం - సింగపెరుమాళ్ కోయిల్ - మధురాంతకం మార్గాలను కలుపుతూ రైలు మార్గం, చెన్నై - సేలం - కోయంబత్తూరులను కలుపుతూ సెమీ హైస్పీడ్ రైల్వే కారిడార్, రాష్ట్రంలో పలు జాతీయ రహదారుల ప్రాజెక్టులను చేపట్టాలని కోరారు. ముఖ్యంగా తాంబరం - చెంగల్పట్టు మధ్య (ఎన్‌హెచ్ 32), చెంగల్పట్టు - దిండివనం వరకు ఎలివేటెడ్ రహదారి నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని, చెన్నై - కన్నియాకుమారి ప్రాంతాలను కలుపుతూ 2005లో ఫోర్ లేన్ మార్గాన్ని ప్రతిపాదించారని, ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని మంత్రి తంగం తెన్నరసు కేంద్ర ఆర్థిక మంత్రికి విజ్ఞప్తి చేశారు.

కోయంబేడు బస్టాండు వద్ద అతిపెద్ద వాణిజ్య కాంప్లెక్స్

48 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణం ● గ్రీన్ పార్క్, చిల్డ్రన్ ప్లే గ్రౌండ్ కూడా

అడయార్, జూన్ 22: స్థానిక కోయంబేడు బస్టాండులో అతిపెద్ద వాణిజ్య భవన సముదాయాన్ని నిర్మించనున్నారు. మొత్తం 48 ఎకరాల్లో ఇది నిర్మితంకానుంది. ఈ కమర్షియల్ కాంప్లెక్స్ ప్రాంగణంలోనే గ్రీన్ పార్కుతో పాటు చిల్డ్రన్ పార్కును కూడా నిర్మించనున్నారు. చెన్నైలోని అతి కీలకమైన ప్రాంతాల్లో కోయంబేడు ఒకటి. ఇక్కడి నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే బస్ టెర్మినల్‌తో పాటూ కూరగాయల మార్కెట్ ఉంది. ఈ కారణంగా ఈ ప్రాంతం నిత్యం రద్దీగా ఉండటంతో పాటు తీవ్రమైన ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఈ సమస్యకు పరిష్కారం కనుగొనే చర్యల్లో భాగంగా నగర శివారు ప్రాంతమైన వండలూరు జూ సమీపంలోని కీలంబాక్కంలో కొత్తగా అతిపెద్ద బస్టాండును నిర్మించిన ప్రభుత్వం దాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో కోయంబేడు బస్టాండు బోసిపోయి కనిపిస్తోంది. ఇక్కడ నుంచి కొన్ని ప్రాంతాలకు వెళ్ళే బసులు మాత్రమే వెళుతున్నాయి. దీంతో ఈ బస్టాండు ప్రాంగణంలో 48 ఎకరాల విస్తీర్ణంలో వాణిజ్య భవన సముదాన్ని నిర్మించాలని గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ నిర్ణయించింది. ఇదే విషయంపై ఆ శాఖకు చెందిన ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ... కోయంబేడు బస్టాండులో అతిపెద్ద వాణిజ్య కాంప్లెక్స్‌ను నిర్మించనున్నారని, ఇందులో చేనేత, హస్తకళా ఉత్పత్తులు, ఫుడ్ కోర్టులకు శాశ్వత స్థలాన్ని కేటాయించనున్నట్టు తెలిపారు. ఈ భవన సముదాయంలో ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలతో పాటు ఇతర ఎంటర్‌టైన్మెంట్ సెంటర్లు కూడా ఉంటాయని తెలిపారు. రాష్ట్రంలోని నలుమూలలకు చెందిన హస్తకళ, చేనేత కార్మికులు తయారు చేసే వస్తు ఉత్పత్తులు ఇక్కడ విక్రయానికి అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. పైగా ఈ బస్టాండు ప్రాంగణంలోనే మెట్రో రైల్ స్టేషన్ అందుబాటులో ఉండటంతో ఎయిర్‌పోర్టుతో పాటు ఇతర ప్రాంతాలకు సులభంగా రాకపోకలు సాగించే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం ప్రైవేటు బస్సులు నిలిచివుండే బస్టాండులో గ్రీన్ పార్క్‌ను నిర్మిస్తారన్నారు. మొత్తం 16 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ ప్రాంతంలో చిల్డ్రన్స్ పార్క్‌ను కూడా నిర్మిస్తారన్నారు. కొత్తగా నిర్మించే బిజినెస్ కాంప్లెక్స్, గ్రీన్ పార్క్, కాళియమ్మన్ ఆలయాలను అనుసంధానం చేస్తారని ఆయన వివరించారు.



సమాచార దర్శిని

పాఠాలకు మాత్రమే స్మార్ట్ తరగతి గదులు

ఐసిఎఫ్, జూన్ 22: స్మార్ట్ తరగతి గదులను పాఠాలు బోధించేందుకు మాత్రమే వినియోగించాలని పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. యూనియన్, మున్సిపాలిటీల్లోని ప్రభుత్వ ప్రాథమి, మాధ్యమిక పాఠశాలల్లో హైటెక్ ల్యాబ్‌లు, స్మార్ట్ తరగతి గదులు ఏర్పాటు చేశారు. వీటి వినియోగం, పర్యవేక్షణకు ఉపాధ్యాయుడిని నియమించనున్నారు. స్మార్ట్ తరగతి గదులను విద్యా బోధనకు మాత్రమే వినియోగించాలని, ల్యాబ్‌ల్లో ఉపకరణాల మరమ్మతులను కెల్ట్రాన్ సంస్థ ద్వారా మాత్రమే చేపట్టాలని అధికారులు సూచించారు.

చదువుపై ఆసక్తి తగ్గిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

ఐసిఎఫ్, జూన్ 22: ఎస్ఎస్ఎల్సీ, ప్లస్‌టూ తరగతుల్లో చదువుపై ఆసక్తి తగ్గిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు ఆది ద్రావిడర్ సంక్షేమ డైరెక్టరేట్ తెలిపింది. ఆదిద్రావిడుల సంక్షేమ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో పనిచేసే పాఠశాలల్లో 2023-24 విద్యా సంవత్సరం టెన్త్, ప్లస్‌టూ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత వివరాలను అధికారులు పరిశీలించనున్నారు. అదే సమయంలో 2024-25 విద్యా సంవత్సరంలో 98 మహోన్నత పాఠశాలలు, 108 ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న టెన్త్, ప్లస్‌టూ విద్యార్థుల్లో చదువులో వెనుకబడిన వారిని గుర్తించి ప్రత్యేక శిక్షణ అందించేలా తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ తరగతుల్లో ఉన్నత, మహోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీజీ టీచర్లు, కంప్యూటర్ టీచర్లు పాల్గొనాలని డైరెక్టరేట్ ఉత్తర్వులు జారీ చేసింది.

పోటీపరీక్షలు రాయడంపై శిక్షణ

ఐసిఎఫ్, జూన్ 22 : పోటీ పరీక్షలు రాయడంపై విద్యార్థులకు పాఠశాల స్థాయిలో శిక్షణ ఇవ్వనున్నట్లు పాఠశాల విద్యాశాఖ తెలిపింది. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదివే ప్లస్‌టూ విద్యార్థులకు నీట్, జేఈఈ ప్రవేశ పరీక్షలకు శిక్షణ ఇచ్చేందుకు ఈ శాఖ నిర్ణయించింది. జిల్లా ప్రధాన విద్యాధికారి ఆధ్వర్యంలో మహోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఫిజిక్స్, మ్యాథ్స్, కెమిస్ట్రీ, బొటనీ, జువాలజీ సబ్జెక్టులలో ఒక్కో పాఠ్యాంశానికి ఇద్దరు నిపుణులు వంతున 10 మంది కలిగిన ఉపాధ్యాయ బృందాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ బృందాలు ప్రతి సోమవారం బొటనీ, మ్యాథ్స్, మంగళవారం ఫిజిక్స్, బుధవారం మ్యాథ్స్, గురువారం కెమిస్ట్రీ, శుక్రవారం రివిజన్ పద్ధతిలో శిక్షణ ఇవ్వనున్నాయి. అన్ని పనిదినాల్లో పాఠ్యాంశాల వారీగా సాయంత్రం 4 నుంచి 5.15 గంటల వరకు తరగతులతో పాటు డైలీ టెస్ట్‌లు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ సూచించింది.

పింఛన్‌దారులకు మొబైల్ యాప్

ఐసిఎఫ్, జూన్ 22: విద్యుత్ బోర్డు పింఛన్‌దారులు లబ్ధిపొందేలా మొబైల్ యాప్ పరిచయం చేశారు. రాష్ట్ర విద్యుత్ బోర్డులో వివిధ విభాగాల్లో పని చేసి 90,000 మందికి పైగా ఉద్యోగ విరమణ పొందారు. వీరికి పింఛన్‌గా నెలకు సుమారు రూ.300కోట్లు అందిస్తున్నారు. పింఛన్‌దారులు యేటా లైఫ్ సర్టిఫికేట్ నేరుగా సమర్పించాల్సి ఉంది. వారు కార్యాలయానికి వచ్చి సర్టిఫికేట్ అందజేసేందుకు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి బోర్డు, TNEB PENSIONER MOBILE APP అనే మొబైల్ యాప్‌ను పరిచయం చేసింది. యాప్‌ను పింఛన్‌దారులు తమ మొబైల్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకున్న అనంతరం బ్యాంక్ ఖాతా నెంబరు, పింఛన్ కమిషన్ నెంబర్లు, వేలిముద్రలు, లైఫ్ సర్టిఫికేట్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులు తెలిపారు.

యోగా, ప్రకృతి కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, జూన్ 22: యోగా, ప్రకృతి వైద్య కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు ఈనెల 23న ఆదివారం నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని భారత వైద్య, హోమియోపతి శాఖ ప్రకటించింది. ప్రభుత్వ, ప్రైవేటు వైద్యకళాశాలల్లో ఉన్న ఈ కోర్సుకు ప్రభుత్వ కోటాలో 960 సీట్లు, మేనేజ్‌మెంట్ కోటాలో 540 సీట్లున్నాయి. ప్లస్‌టూ మార్కుల ఆధారంగా 2024-25 విద్యా సంవత్సరం అడ్మిషన్లు జరుగనున్నాయి. ఐదేళ్ల బీఎన్‌వైఎస్ అనే ఈ కోర్సుకు జూలై 8వ తేది వరకు https://www.tnhealth.tn.gov.in/లో దరఖాస్తు చేసుకోవచ్చు.

శానిటైజర్ కొనుగోలుకు గుర్తింపు కార్డు తప్పనిసరి

ఐసిఎఫ్, జూన్ 22: గుర్తింపుకార్డులున్న వారికే శానిటైజర్లు విక్రయించనున్నట్లు రాష్ట్ర మందుల విక్రయదారుల సంఘం వెల్లడించింది. కళ్లకుర్చిలో కల్తీ సారా తాగి 52 మంది మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనతో స్పిరిట్ విక్రయాలపై ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ఈ నేపథ్యంలో, మందుల దుకాణాల్లో శానిటైజర్, హ్యాండ్ వాష్, స్పిరిట్ వంటి వాటిని కొనుగోలు చేసేందుకు వచ్చే వారు తప్పనిసరిగా గుర్తింపుకార్డు కానీ, డాక్టరు అనుమతి చీటీ తీసుకురావాలని విక్రయదారుల సంఘం పేర్కొంది.

8నుంచి టీచర్ల బదిలీ కౌన్సెలింగ్

పెరంబూర్, జూన్ 22: ఉపాధ్యాయుల జనరల్ బదిలీ కౌన్సెలింగ్ జూలై 8 నుంచి 31వ తేది వరకు జరుగుతుందని పాఠశాల విద్యాశాఖ తెలిపింది. బదిలీలకు దరఖాస్తులు సమర్పించిన ఉపాధ్యాయులు ప్రాధాన్యత జాబితా జూలై 3వ తేది విడుదల చేయనున్నారు. ప్రాధాన్యత జాబితాపై 4,5 తేదీల్లో సవరణలు చేపట్టవచ్చని పాఠశాల విద్యాశాఖ ప్రకటన విడుదల చేసింది.

రేపటినుంచి అమరావతి నీటి విడుదల

పెరంబూర్, జూన్ 22: తిరుప్పూర్ జిల్లా సాగునీటి అవసరాలకు అమరావతి డ్యాం నుంచి నీరు విడుదల చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని రామకుళం, కల్లాపురం, కుమరిలింగం, సార్కరై, కన్నాడిపుత్తూర్ తదితర 8 కాలువలకు ఈ నెల 24 నుంచి నవంబరు 6వ తేది వరకు నీటిని విడుదల చేయనున్నట్లు, ఈ నీటితో జిల్లాలోని 7,520 ఎకరాలకు సాగునీరు అందనుందని ప్రభుత్వం తెలిపింది.

వీధికుక్కల దాడిలో ఎనిమిదేళ్ల బాలికకు గాయాలు

పెరంబూర్, జూన్ 22: తెన్‌కాశి జిల్లా అచ్చంపుదూర్‌లో 9 ఏళ్ల బాలికపై 10 వీధి కుక్కలు దాడిచేశాయి. వీధిలో ఆడుకుంటున్న బాలికను చుట్టుముట్టిన కుక్కలు, బాలికను ఈడ్చుకుంటూ రోడ్లపై పరుగులు తీశాయి. బాలిక పెట్టిన కేకలతో చుట్టుపక్కల వారు కుక్కలను అక్కడి నుంచి తరిమి, బాలికను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీధుల్లో కుక్కల బెడద అధికంగా ఉందని అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదని, ఈ ప్రమాదానికి అధికారులే బాధ్యత వహించాలని బాధిత బాలిక బంధువులు ఆరోపించారు.

కళ్లకుర్చి సారా బాధితులకు మెరుగైన వైద్య సేవలు

56 మంది ప్రత్యేక వైద్య నిపుణులు ● జిల్లా కలెక్టర్ ప్రశాంత్ వెల్లడి

అడయార్, జూన్ 22: కళ్ళకుర్చి సారా బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని, ఇందుకోసం ఇతర జిల్లాల నుంచి 56 మంది వైద్య నిపుణులను రప్పించినట్టు ఆ జిల్లా కలెక్టర్ ప్రశాంత్ తెలిపారు. వీరంతా కళ్ళకుర్చి ప్రభుత్వ వైద్యులతో కలిసి సమన్వయంతో వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ఈ విషయంపై ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ... కల్తీసారా తాగి అస్వస్థతకు గురైన వారిలో 193 మందిని చికిత్స కోసం ఆస్పత్రిలో చేర్పినట్టు తెలిపారు. వీరిలో కళ్ళకుర్చి, సేలం, విల్లుపురం, పుదుచ్చేరి జిప్మర్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారన్నారు. వీరికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఇతర జిల్లాల నుంచి 56 మంది వైద్య నిపుణులను కళ్ళకుర్చికి రప్పించినట్టు వివరించారు. ఇదిలావుంటే, కళ్ళకుర్చి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కల్తీసారా బాధితుల్లో 30 మంది ఆరోగ్య మెరుగుపడటంతో డిశ్చార్జ్ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు సమాచారం.

ఈపీఎస్ ఆరోపణలు అసత్యాలు

● మంత్రి రఘుపతి

ప్యారీస్, జూన్ 22: కళ్లకుర్చి దుర్ఘటనపై అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి చెప్పే ఆరోపణలన్నీ అవాస్తవాలని రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి రఘుపతి పేర్కొన్నారు. శనివారం ఉదయం అసెంబ్లీ ప్రాంగణంలో మంత్రి రఘుపతి మీడియాతో మాట్లాడుతూ... ప్రజా సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడేందుకు అధికారం, మిత్రపక్ష పార్టీలు సహా ప్రతిపక్ష సభ్యులకు సమానంగా అవకాశం కల్పిస్తున్నామని, అయితే పళనిస్వామి డీఎంకే ప్రభుత్వంపై బురద చల్లాలన్న ఉద్దేశంతో కళ్లకుర్చి ఘటనపై మాట్లాడేందుకు తమకు అవకాశం ఇవ్వడం లేదని మీడియాకు తెలియజేస్తున్నారని తెలిపారు. ప్రతిపక్ష నేత ఒక అంశంపై మాట్లాడ దలచుకుంటే ముందుగానే స్పీకర్‌ను సంప్రదించి అనుమతి పొందాల్సి ఉంటుందని, రాష్ట్ర శాసనసభలో ఈ సంప్రదాయం ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా అమలులో ఉంటుందన్నారు. అయితే, పళనిస్వామి ఆ సంప్రదాయం గౌరవించకుండా అసెంబ్లీలో కళ్లకుర్చి మరణాలపై మాట్లాడేందుకు అనుమతించాలని శుక్రవారం స్పీకర్‌ను కోరారని, ఇందుకు స్పీకర్ ప్రశ్నోత్తరాల సమయం తర్వాత మాట్లాడవచ్చని తెలిపారని, అయినా అన్నాడీఎంకే సభ్యులు ఉద్దేశపూర్వకంగానే అసెంబ్లీ సమావేశాలకు అంతరాయం కలుగజేసేలా గొడవలకు పాల్పడ్డారని మండిపడ్డారు. కల్తీ సారా తయారీ, విక్రయాల వివరాలను ప్రతిపక్ష సభ్యులు ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తే చర్యలు చేపడతామన్నారు.

8 మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీ

ఐసిఎఫ్, జూన్ 22: తాంబరం పోలీస్ కమిషనరేట్‌లో 8 మంది ఇన్‌స్పెక్టర్లు బదిలీ అయ్యారు. ఇంటెలిజెన్స్ విభాగం ఇన్‌స్పెక్టర్ నటరాజన్ పల్లికరనై పోలీస్ స్టేషన్‌కు, కన్నగి నగర్ క్రైం విభాగం ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తాంబరం పోలీస్‌స్టేషన్‌కు, గుడువాంజేరి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ క్రోంపేట పోలీస్‌స్టేషన్‌కు, పల్లికరనై ఇన్‌స్పెక్టర్ అనీల్‌కుమార్ ఇంటెలిజెన్స్ విభాగానికి, వేకెంట్ రిలీవ్‌లో ఉన్న ఇన్‌స్పెక్టర్ రాకుమతి సేలయూరు మహిళా పోలీస్‌స్టేషన్‌కు, ఇంటెలిజెన్స్ విభాగం ఇన్‌స్పెక్టర్ సతీష్ గుడువాంజేరి పోలీస్‌స్టేషన్‌కు, పల్లికరనై క్రైం విభాగం ఇన్‌స్పెక్టర్ వెంకటేశన్ కీలంబాక్కం శాంతి భద్రతల విభాగానికి, కీలంబాక్కం ఇన్‌స్పెక్టర్ దీపక్‌కుమార్ పల్లికరనై క్రైం విభాగానికి బదిలీ అయ్యారు.

డీఎంకే యువజన విభాగం ఆందోళన వాయిదా

పెరంబూర్, జూన్ 22: 'నీట్' రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ డీఎంకే యువజన విభాగం చేపట్టనున్న ఆందోళన రద్దయింది. స్థానిక వళ్లువర్‌కోట్టం వద్ద ఈ నెల 24వ తేది నిర్వహించాల్సిన ఆందోళన వాయిదా వేసినట్లు విభాగం పేర్కొంది. తదుపరి నిర్వహించే తేదీ త్వరలో ప్రకటించనుంది.

రష్యన్ ఎడ్యుకేషనల్ ఫెయిర్ ప్రారంభం

ప్యారీస్, జూన్ 22: స్థానిక ఆళ్వార్‌పేటలోని రష్యన్ కల్చరల్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన ఆలిండియా రష్యన్ ఎడ్యుకేషనల్ రెండు రోజుల ప్రదర్శన శనివారం ప్రారంభమైంది. ఎంబీబీఎస్ సీట్ల స్పాట్ రిజిస్ట్రేషన్ కల్పన దిశగా ఆదివారం వరకు కొనసాగనున్న ఈ ఫెయిర్‌ను రష్యన్ ఫెడరేషన్ కాన్సులేట్ జనరల్ ఒలేఅవుదీవ్ ప్రారంభించారు. రష్యన్ హౌస్ డైరెక్టర్ అలెగ్జాండర్ దుడేనేవ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ... రష్యాలోని వైద్య విద్యాసంస్థల్లో 2024-25 సంవత్సరంలో చేరదలచిన భారతీయ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఎడ్యుకేషన్ ఫెయిర్ నగరంలో రెండు రోజులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 25న మదురై రెసిడెన్సీ హోటల్, 26న తిరుచ్చి ఫెమినా హోటల్, 27న సేలం జీఆర్టీ హోటల్, 28న కోవై గ్రాండ్ రీజెంట్ హోటల్‌లో ఈ ప్రదర్శన జరుగుతుందని, వివరాలకు నెం.9282221221లో సంప్రదించవచ్చని తెలిపారు. స్టడీ అబ్రాడ్ ఎడ్యుకేషన్ కన్సల్టెంట్ ఎండీ రవిచంద్రన్ పాల్గొన్నారు.

రేలా ఆసుపత్రిలో సాఫ్ట్‌వేర్ నిపుణుడికి అరుదైన మోకాలి శస్త్రచికిత్స



శస్త్రచికిత్స చేసుకున్న బాధితుడితో డాక్టర్లు

చెన్నై, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక క్రోంపేటలోని రేలా ఆసుపత్రిలో మణికంఠన్ అనే సాఫ్ట్‌వేర్ నిపుణుడికి అరుదైన మోకాలి శస్త్రచికిత్సను నిర్వహించినట్లు ఆ ఆసుపత్రి సీఈఓ డాక్టర్ ఇలన్‌కుమరన్ కలియమూర్తి తెలిపారు. మూడునెలలకు ముందు రోడ్డు ప్రమాదంలోదెబ్బతిన్న మోకాలికీలు వద్ద సింథటిక్ లిగమెంట్స్(కృత్రిమ స్నాయువులను)ను అమర్చి ఆర్థ్రోస్కోపీ శస్త్రచికిత్సను జరిపారని వివరించారు. ఇలాంటి అరుదైన శస్త్రచికిత్స జరుపటం రాష్ట్రంలో తొలిసారి అని ఆయన చెప్పారు. ఆసుపత్రి వైద్యనిపుణులు ప్రకాష్ అయ్యాదురై, అశోక్ జి.గవాస్కర్, పార్థసారథి శ్రీనివాసన్ ఈ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు.

ఘనంగా చెన్నైస్ అమృత 8వ స్నాతకోత్సవం



అడయార్, జూన్ 22: చెన్నై అమృతా గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ తన ఎనిమిదో వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకుంది. నగరంలోని ఓ నక్షత్ర హోటల్‌లో జరిగిన ఈ వేడుకల్లో ఓపెన్ యూనివర్శిటీ మలేసియా (ఏయూఎం) నుంచి ప్రొఫెషనల్ డిప్లొమా, ఎగ్జిక్యూటివ్ డిప్లొమా సర్టిఫికేషన్‌లను పొందిన 250 మంది విద్యార్థులకు ఈ ఈవెంట్ ఓ మరిచిపోని జ్ఞాపకంగా నిలిచింది. ఏయూఎంతో చెన్నై అమృతాస్ గత 2012 నుంచి ఒక అవగాహన ఒప్పందాన్ని కలిగివుంది. హోటల్ మేనేజ్‌మెంట్‌లో ప్రపంచ స్థాయి విద్యను అందించడానికి ఈ ఒప్పందం ఎంతగానో దోహదపడుతుంది. ఈ సందర్భంగా ఓయూఎం గౌరవాధ్యక్షుడు డాక్టర్ అమ్మద్ ఇజానీ అవాంగ్, చెన్నై చెంగల్పట్టు, బెంగళూరు, హైదరాబాద్ క్యాంపస్‌లకు చెందిన గ్రాడ్యుయేట్స్‌కు డిప్లొమా సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో చెన్నై అమృతాస్ గ్రూపు ఛైర్మన్ ఆర్.భూమినాథన్ తదితరులు పాల్గొన్నారు.

హీరో విజయ్‌కు బర్త్‌డే వేడుకలు

నీలాంగరైలో అపశృతి

అడయార్, జూన్ 22: అగ్రహీరో, తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు విజయ్‌కు పుట్టిన రోజు సందర్భంగా పలువురు సినీ నటులు బర్త్‌డే విషెస్ చెప్పారు. విశ్వనటుడు కమల్ హాసన్, ప్రభుదేవా, సినీ నిర్మాత అర్చ కల్పాతి, నటి వరలక్ష్మి శరత్ కుమార్, సినీ దర్శకుడు అట్లీ, నామ్ తమిళర్ కట్చి అధ్యక్షుడు సీమాన్, దర్శకుడు వెంకట్ ప్రభు, ఇలా అనేక మంది ఉన్నారు. అయితే, కళ్ళకుర్చి కల్తీసారా దుర్ఘటన నేపథ్యంలో విజయ్ తన పుట్టిన రోజు వేడుకలకు దూరంగా ఉన్నారు. కానీ, ఆయన అభిమానులు మాత్రం వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేసి, పేదలకు అన్నదానాలు, రోగులకు పండ్లు, పాలు, బ్రెడ్ వంటివి దానం చేశారు. ఇదిలావుంటే, స్థానిక నీలాంకరైలో జరిగిన విజయ్ బర్త్‌డే వేడుకల్లో అపశృతి జరిగింది. విజయ్ అభిమానులు ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో అనేక మంది పేదలకు వివిధ రకాలైన సంక్షేమ సహాయాలను పంపిణీ చేశారు. ఈ వేడుకల్లో పాల్గొన్న ఓ బాలుడు.. చేతిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని మట్టి పెంకులను పగులగొట్టే సాహస క్రీడకు పూనుకున్నాడు. ఇది వికటించి, ఆ బాలుడి చేతిక నిప్పంటుకుంది. ఆ సమయంలో పక్కను ఉన్నవారు మంటలను ఆర్పేశారు. అయిప్పటికీ చేతికి గాయం కావడంతో ఆ బాలుడిని సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే, ఈ సాహసక్రీడను పోలీసుల అనుమతి లేకుండా నిర్వహించినట్టు సమాచారం.

రాష్ట్రానికి పదేళ్లలో రూ.11 లక్షల కోట్లు

● కేంద్ర మంత్రి మురుగన్

పెరంబూర్, జూన్ 22: రాష్ట్రాభివృద్ధికి పదేళ్లలో రూ.11 లక్షల కోట్లు అందజేసినట్లు కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ తెలిపారు. నామక్కల్ జిల్లా తిరుచెంగోడులో ఆయన మాట్లాడుతూ... ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని కూటమి ఓటమి చవిచూసినా, రాష్ట్రానికి చెందిన వ్యక్తి కేంద్ర మంత్రివర్గంలో ఉండాలనే ప్రధాని నరేంద్రమోదీ కోరికతో, రెండో సారి తాను కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టానన్నారు. తమిళనాడుపై ప్రధానికి ప్రత్యేక అభిమానం ఉందని, రాష్ట్రాభివృద్ధికి అవసరమైన నిధులు కేంద్రం నుంచి పొందేలా కృషిచేస్తానని ఆయన తెలిపారు.

కళ్లకుర్చి బాధిత కుటుంబాలకు సాయం

● కాంగ్రెస్ ఎస్సీ విభాగం అధ్యక్షుడు రంజన్‌కుమార్



ప్యారీస్, జూన్ 22: కళ్లకుర్చిలో కల్తీ సారా తాగి మరణించిన వారి కుటుంబాలు, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి సాయం అందజేయనున్నట్లు తమిళనాడు కాంగ్రెస్ కమిటీ ఎస్సీ విభాగ అధ్యక్షుడు ఎంపీ రంజన్‌కుమార్ ప్రకటించారు. శనివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... కళ్లకుర్చి దుర్ఘటనకు బాధ్యులైన అధికారులు, విక్రయించిన వారిపై ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టిందని, భవిష్యత్తులో ఇలాంటి విషాద సంఘటన జరగకుండా ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరించాలని తెలిపారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి కళ్లకుర్చి సంఘటనపై చౌకబారు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. రాజకీయ పార్టీల నాయకులు ప్రజలను తప్పు దారి పట్టించే విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. కళ్లకుర్చిలో బాధిత కుటుంబాలను ఒకటి, రెండు రోజుల్లో సంప్రదించి వారికి తమ విభాగం తరఫున సహాయాలు అందజేస్తామని, ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో అన్ని పార్టీలు ఏకాభిప్రాయంతో ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.

నీలగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ప్రాంగణంలో చిరుత సంచారం



సీసీ కెమెరా ఫుటేజీలో చిరుత సంచార దృశ్యాలు

పెరంబూర్, జూన్ 22: నీలగిరిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో చిరుత సంచరించే దృశ్యాలు సీసీ కెమెరా ఫుటేజీలో వెలుగుచూశాయి. నీలగిరి జిల్లాలోని ఊటీ, కున్నూరు, కోతగిరి తదితర పర్యాటక ప్రాంతాల్లో కొంతకాలంగా చిరుతల సంచారం అధికంగా ఉంది. ఈ నేపథ్యంలో, ఊటీ సమీపం తునేరిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వేకువజామున ఓ చిరుత ప్రవేశించింది. ఈ దృశ్యాలు ఆ ప్రాంతంలోని సీసీ కెమెరా నమోదయ్యాయి. సమాచారం అందుకున్న అటవీ శాఖ సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకొని పరిశీలించారు. రాత్రి వేళల్లో ఒంటరిగా బయటకు రావద్దని, చిరుత సంచరిస్తే సత్వరం తమకు సమాచారం తెలియజేయాలని అటవీ సిబ్బంది ఆ ప్రాంత ప్రజలు, ఆరోగ్య కేంద్రం సిబ్బందికి తెలియజేశారు.

నియోజకవర్గ అభివృద్ధి నిధులు రూ.10 కోట్లకు పెంచాలి

● కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రాన్సిస్

అడయార్, జూన్ 22: ప్రస్తుతం ఎమ్మెల్యేలకు నియోజకవర్గ అభివృద్ధి నిధి కింద ఇచ్చే రూ.3 కోట్ల నిధులను రూ.10 కోట్లకు పెంచాలని కాంగ్రెస్ పార్టీకి చెందిన కుళచ్చల్ ఎమ్మెల్యే ప్రాన్సిస్ కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా, శనివారం రాష్ట్ర పురపాలక పరిపాలన, నీటి సరఫరా, గ్రామీణాభివృద్ధి తదితర అంశాలపై చర్చ జరిగింది. ఇందులో ఎమ్మెల్యే ప్రాన్సిస్ మాట్లాడుతూ... కన్నియాకుమారి జిల్లాలో 25 పంచాయతీలను పట్టణ పంచాయతీలలో విలీనం చేయాలన్న నిర్ణయాన్ని విరమించుకోవాలన్నారు. 2023లో వరదల కారణంగా ఆవాసాలను కోల్పోయిన బాధితులకు పక్కా ఇళ్ళను నిర్మించే అవకాశం ఉందా? అని ప్రశ్నించారు. ఈ పక్కా గృహాలకు ప్రభుత్వం ఇచ్చే నిధులను రూ.7 లక్షలకు పెంచాలని కోరారు. పట్టణ పంచాయతీల్లో కాంట్రాక్టు విధానంలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలను కల్పించాలని కోరారు.

పెట్రోల్ బంక్ గోడను ఢీకొన్న ప్రభుత్వ బస్సు

● మహిళ మృతి, ఐదుగురికి గాయాలు

ప్యారీస్, జూన్ 22: స్థానిక చోళవరం సమీపంలోని సెంబులివరం ప్రాంతంలో ఉన్న పెట్రోల్ బంక్ గోడను ప్రభుత్వ బస్సు ఢీకొన్న ఘటనలో మహిళా ప్రయాణికురాలు మృతిచెందగా, మరో ఐదుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. కోయంబేడు నుంచి శనివారం ఉదయం ఆంధ్ర రాష్ట్రం సత్యవేడు వైపుకు తమిళనాడు రవాణా సంస్థ బస్సు ప్రయాణికులతో బయల్దేరింది. చోళవరం సమీపంలోని కారనోడకు చెందిన యతిరాజ్ (55) నడిపిన బస్సు సెంబులివరం ప్రాంతంలో వెళుతున్న సమయంలో ఎదురుగా వన్‌వేలో వేగంగా వచ్చిన లోడు వాహనాన్ని తప్పించేలా సర్వీస్ రోడ్డుకు బస్సు మళ్లించారు. అప్పుడు ఊహించని విధంగా ఆ మార్గంలో ఉన్న ఓ పెట్రోల్ బంక్ గోడను బస్సు ఢీకొంది. బస్సులో ప్రయాణిస్తున్న వడక్కునల్లూర్‌కు చెందిన సుధ (45) అక్కడికక్కడే మరణించగా, డ్రైవర్ సహా నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

రాష్ట్రంలో పాడైన, దెబ్బతిన్న బోగీలతో రైళ్లు

● హైకోర్టు మదురై బెంచ్ అసంతృప్తి


పెరంబూర్, జూన్ 22: రాష్ట్రంలో నడుపుతున్న రైళ్లకు పాడైన, దెబ్బతిన్న బోగీలు అనుసంధానం చేస్తున్నారని హైకోర్టు మదురై బెంచ్ వ్యాఖ్యానించింది. తంజావూరుకు చెందిన సుందర విమలనాథన్, దివ్యాంగుల గుర్తింపు కార్డులు డిజిటల్ విధానంలో పరిశీలించేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ హైకోర్టు మదురై బెంచ్‌లో పిటిషన్ దాఖలు చేశారు. అలాగే, దేశవ్యాప్తంగా డిజిటల్ విధానంలో దివ్యాంగుల గుర్తింపుకార్డులు పరిశీలిస్తున్న నేపథ్యంలో, రాష్ట్రంలో మాత్రం ఈ విధానం అమలుకు రాలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌విచారించిన ధర్మాసనం...రాష్ట్రంలో నడుపుతున్న రైళ్లకు పాడైన దెబ్బతిన్న బోగీలు అనుసంధానం చేస్తున్నారని, ఉత్తరాది రాష్ట్రాల్లోనే అధునాతన రైలు బోగీలు అనుసంధానం చేస్తున్నారని వ్యాఖ్యానించింది. ఛార్జీలు అధికంగా పెంచుతున్నా, నిర్వహణలో నిర్లక్షంగా వ్యవహరిస్తున్నారని, పలు రైళ్లలో ప్రయాణికులకు అందిస్తున్న సేవలు చాలా తక్కువగా ఉన్నాయని పేర్కొంది. రైళ్లను సక్రమంగా పర్యవేక్షించాలని కేంద్ర ప్రభుత్వ న్యాయవాదికి సూచించిన ధర్మాసనం, ఈ కేసు తదుపరివిచారణ జూలై 8వ తేదీకి వాయిదావేస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

15 ఏళ్ల బాలుడికి 'ఎయిడ్స్' అంటూ తప్పుడు సర్టిఫికెట్

● పోలీసులకు తల్లిదండ్రుల ఫిర్యాదు

పెరంబూర్, జూన్ 22: విదేశాలకు వెళ్లేందుకు రక్త పరీక్ష చేయించుకున్న బాలుడికి 'ఎయిడ్స్' అంటూ నకిలీ సర్టిఫికెట్ అందజేసిన ల్యాబ్‌పై చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విదేశాలకు వెళ్లేందుకు 15 ఏళ్ల బాలుడికి స్థానిక అరుంబాక్కంలోని ఓ ప్రైవేటు ల్యాబ్‌లో తల్లిదండ్రులు రక్త పరీక్షలు చేయించారు. అందులో బాలుడికి 'ఎయిడ్స్' ఉన్నట్లు సర్టిఫికెట్ అందజేశారు. దీంతో, దిగ్భ్రాంతి చెందిన తల్లిదండ్రులు, చెంగల్పట్టులోని కేంద్రంలో మళ్లీ నిర్వహించిన రక్త పరీక్షల్లో, బాలుడికి ఎలాంటి అనారోగ్యం లేదని తెలిసింది. ఈ వ్యవహారంపై తల్లిదండ్రులు అరుంబాక్కం ప్రైవేటు ల్యాబ్‌ను సంప్రదించగా, మా తప్పు ఏమీ లేదంటూ పంపించారు. మరుసటిరోజు మొబైల్ లో బాలుడి తల్లిదండ్రులను సంప్రదించిన ల్యాబ్ నిర్వాహకులు... పరిశోధన ఫలితాల్లో తప్పు దొర్లిందని, క్షమించాలంటూ పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై బాధిత బాలుడి తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు విచారణ చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి



విష్ణు మృతదేహం

గుత్తిరూరల్, జూన్ 22: ఆంధ్ర రాష్ట్రం అనంతపురం జిల్లా గుత్తి మండలంలోని కొత్తపేట గ్రామశివారు 44వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో విష్ణు(4) మృతి చెందాడు. శనివారం తమిళనాడు రాష్ట్రం ధర్మపురి జిల్లా పెన్నాగరానికి చెందిన కార్తీక్, ఆయన భార్య సత్య, కుమారుడు విష్ణు, బావమరిది మోహన్‌తో కలసి ద్విచక్రవాహనంపై హైదరాబాద్ వెళ్తున్నారు. కొత్తపేట శివార్లలో ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో నలుగురికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే విష్ణు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కార్తీక్ హైదారాబాద్‌లో హాట్ చిప్స్ దుకాణం పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

నరసారెడ్డికి మాతృవియోగం



శేషమ్మ (ఫైల్ ఫొటో)

చెన్నై, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): 'కెన్సెస్' గ్రూపుల అధినేత కె.నరసారెడ్డికి మాతృవియోగం కలిగింది. ఆయన మాతృమూర్తి కె.శేషమ్మ(95) శనివారం ఉదయం హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఆమె పార్థివదేహానికి ఆదివారం ఉదయం 11 గంటలకు అక్కడే అంత్యక్రియలు జరగనున్నాయి. శేషమ్మ జీవితభాగస్వామి 25 ఏళ్ల క్రితమే మృతి చెందారు. వారికి ముగ్గురు సంతానం. పెద్ద కుమారుడు నరసారెడ్డి, చిన్న కుమారుడు కె.సుధాకర్‌రెడ్డి, కుమార్తె ఝాన్సీ ఉన్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్, రోడ్ నెం.10, ప్లాట్ నెం.156లో ఉంటున్న సుధాకర్‌రెడ్డి నివాసంలోనే ఆమె తుదిశ్వాస విడిచారు. కాగా శేషమ్మ మృతి పట్ల నగరంలోని పలువురు తెలుగు ప్రముఖులు, తెలుగు సంస్థల ప్రతినిధులు తీవ్ర సంతాపం ప్రకటించారు.

స్పాలో వ్యభిచారం : ఒకరి అరెస్ట్

పెరంబూర్, జూన్ 22: స్థానిక మడిపాక్కంలోని స్పా సెంటర్‌లో వ్యభిచారం సాగిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. మడిపాక్కం రామ్‌నగర్ 6వ వీధిలో పనిచేస్తున్న స్పా సెంటర్‌లో వ్యభిచారం జరుగుతోందని పోలీసులకు సమాచారం అందింది. దీంతో, శుక్రవారం సాయంత్రం ఆ స్పాలో ఆకస్మిక తనిఖీలు చేపట్టిన పోలీసులు, వ్యభిచారం జరుగుతున్నట్లు గుర్తించారు. స్పా నిర్వాహకుడు అరుంబాక్కం రామస్వామి రాజా వీధికి చెందిన మైఖేల్ మాల్సమ్ (26)ను అరెస్ట్ చేసిన పోలీసులు, అతని నుంచి మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, స్పాలో ఉన్న పొరుగు రాష్ట్రాలకు చెందిన 10 మంది యువతులను ప్రభుత్వ హోంకు తరలించారు. అలాగే, ఈ వ్యవహారంలో పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఇక మైఖేల్ మల్సామ్‌ను కోర్టులో హాజరుపరచి, కోర్టు ఉత్తర్వులతో జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు.

తల్లి, తమ్ముడిని హతమార్చిన యువకుడి అరెస్ట్

పెరంబూర్, జూన్ 22: స్థానిక తిరువొత్తియూర్‌లో తల్లి, తమ్ముడిని హతమార్చిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. మార్వాడి కాలనీ తిరునగర్ 1వ వీధికి చెందిన పద్మ(48)కు నితీష్(20), 15 ఏళ్ల కుమారుడున్నారు. పద్మ భర్త ఒమన్‌లో ఉద్యోగం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, శనివారం రాత్రి నితీష్ తమ బంధువుకు పంపిన వాయిస్ మెసేజ్‌లో, తాను తల్లి పద్మ, తమ్ముడిని హత్య చేయనున్నట్లు తెలిపారు. దీంతో, సదరు బంధువు ఈ విషయాన్ని పద్మ ఇంటి పక్కనున్న మరో బంధువులకు తెలియజేసింది. వారు వెంటనే ఇంట్లోకి వెళ్లి చూడగా ఇద్దరూ రక్తపుమడుగులో పడి ఉండడం గుర్తించి తిరువొత్తియూర్ పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి నితీష్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. ప్రాథమిక విచారణలో, ఈ నెల 20వ తేది తెల్లవారుజామున తల్లి పద్మ, తమ్ముడిని హతమార్చిన నితీష్, అనంతరం ఇంటికి తాళం వేసి వెళ్లినట్లు తెలిసింది. ఈ ఘటనలో నితీష్ అరెస్ట్ చేసిన పోలీసులు కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

విద్యుదాఘాతానికి ఇద్దరు బాలుర మృతి



మృతిచెందిన బాలురు

పెరంబూర్, జూన్ 22: విద్యుదాఘాతానికి ఇద్దరు బాలురు మృతి చెందారు. ఈఘటన విల్లుపురం జిల్లాలో శనివారం జరిగింది. తడుతాత్‌కొండూరుకి చందిన యోగేష్ (6), సప్తగిరి (11) గ్రామ శివార్లలోని పొలంలో ఉన్న పంప్ సెట్ వద్దకు వెళ్లారు. పంపు నుంచి పొలాలకు విడుదల చేస్తున్న నీటిలో మునిగేందుకు ఇద్దరూ దిగారు. ఊహించని విధంగా వారు పంప్ సెట్‌కు తగలడంతో షాక్‌కు గురై సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. గమనించిన చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకొని విద్యుత్ సరఫరా నిలిపివేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విమానానికి బాంబు బెదిరింపు: యువకుడి అరెస్ట్

పెరంబూర్, జూన్ 22: ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానానికి బాంబు బెదిరింపునకు పాల్పడిన తంజావూరుకు చెందిన యువకుడిని సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. పెరుంబాక్కంలోని ఇండిగో ఎయిర్‌లైన్స్ కస్టమర్ సర్వీస్ సెంటర్‌కు ఈ నెల 18వ తేది రాత్రి 8.45 గంటలకు ఫోన్ చేసిన ఆగంతకుడు, చెన్నై-ముంబై వెళ్లే విమానంలో బాంబు ఉంచినట్లు, రాత్రి 9.45 గంటలకు అది పేలుతుందనితెలిపి ఫోన్ కట్ చేశారు. ఈ విషయమై కస్టమర్ సెంటర్ నిర్వాహకులు విమానాశ్రయ అధికారులు, పోలీసులకు తెలియజేశారు. ఈ వ్యవహారంపై చెన్నై సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసి, ఈ కాల్ తంజావూరు జిల్లా తిరువయ్యారులోని ల్యాండ్‌లైన్ నెంబరు నుంచి వచ్చిందని గుర్తించారు. అక్కడకు వెళ్లిన పోలీసులు వి.ప్రసన్న(27) అరెస్ట్‌చేసి శనివారం కోర్టులో హాజరుపరచి జ్యుడీషియల్ కస్టడీకి జైలుకు తరలించారు.

ఏనుగు దాడిలో ఒకరి మృతి

పెరంబూర్, జూన్ 22: కోయంబత్తూర్ జిల్లాలో ఏనుగు దాడిలో ఒకరు మృతిచెందాడు. అడుక్కల్ అటవీ ప్రాంతంలో ఈ నెల 20వ తేది రంగస్వామి వెళుతుండగా, సమీపంలోని పొదల చాటు నుంచి వచ్చిన ఏనుగు అతనిపై దాడిచేసింది. ఈ ఘటనను గమనించిన చుట్టుపక్కల వారు ఏనుగును అక్కడి నుంచి తరమివేసి, రంగస్వామిని కోయంబత్తూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సలు ఫలించక శనివారం ఉదయం అతను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో మహిళ సహా నలుగురి మృతి

ప్యారీస్, జూన్ 22: తిరువణ్ణామలైలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో మహిళ సహా నలుగురు మృతిచెందగా, మరో 9 మందికి గాయాలయ్యాయని ట్రాఫిక్ విభాగం పోలీసులు తెలిపారు. తిరువణ్ణామలై సమీపంలోని అగరం గ్రామానికి చెందిన రాజమాణిక్యం కుమారుడు మురుగన్, కీల్నాతూర్ ప్రాంతానికి చెందిన నారాయణన్ కుమారుడు విజయకాంత్ భవన నిర్మాణ కార్మికులు. వీరు శుక్రవారం రాత్రి 9 గంటలకు ద్విచక్రవాహనంలో అగరం నుంచి కీల్నాత్తూరుకు బయల్దేరి వెళ్లారు. వారు తిరువణ్ణామలై బైపాస్ రోడ్డులో వెళ్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న కర్ణాటక రాష్ట్రానికి చెందిన కారు అదుపుతప్పి ద్విచక్రవాహనాన్ని ఢీకొనింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన మురుగన్, విజయకాంత్‌ను అంబులెన్స్‌లో తిరువణ్ణామలై ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందారు. అలాగే, శనివారం తెల్లవారుజామున తిరువణ్ణామలై గిరి ప్రదక్షిణ ముగించుకున్న 9 మంది తిరుపతికి కారులో బయల్దేరారు. వారు ఉదయం 5.30 గంటల ప్రాంతంలో కురుమలై ప్రాంతం చేరుకున్న సమయంలో ఎదురుగా వచ్చిన ప్రభుత్వ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో తిరుపతి కొత్తపేటకు చెందిన జగన్మోహన్(17), రెడ్డిగుంటకు చెందిన గోపాల్ భార్య ప్రవల్లిక (34) అనే ఇద్దరు తీవ్రగాయాలతో సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. సమాచారం తెలిసి అక్కడకు చేరుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ రెండు ప్రమాదాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

చిన్నారుల కోసం మ్యాంగో ఫెస్టివల్



వేడుకల్లో పాల్గొన్న హనురెడ్డి, చిన్నారులు

చెన్నై, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతమైన ఒత్తి వాక్కంలోని రాఘవ ఫారం లో సేవాచక్ర చిల్డ్రన్స్ హోంకు చెందిన నిరుపేద పిల్లల కోసం జాతీయ స్థాయిలో మామిడి పండ్ల పెంపకంలో పేరుగడించిన హనురెడ్డి మామిడి పండ్ల ఉత్సవాన్ని ఆటాపాటలతో ఘనంగా నిర్వహించారు. హనురెడ్డి తండ్రి సి.రాఘవరెడ్డి శతజయంతి సందర్భంగా ఈ ప్రత్యేక వేడుకలు జరిగాయి. సుమారు 50 మంది చిన్నారులు పాల్గొని వివిధ రకాల మామిడి పండ్ల రుచిని ఆస్వాదించారు.

ధనుష్కోటిలో ఇద్దరు శ్రీలంక జాలర్ల అరెస్ట్

ప్యారీస్, జూన్ 22: రామనాథపురం జిల్లా ధనుష్కోటి సముద్రతీరానికి అనుమతి లేకుండా వచ్చిన ఇద్దరు శ్రీలంక జాలర్లను భారత కోస్ట్‌గార్డ్ సిబ్బంది అరెస్ట్ చేశారు. శ్రీలంక బుద్ధలం జిల్లా కల్పిట్టికి చెందిన ఇద్దరు జాలర్లు సముద్రంలో ఫైబర్ పడవలో చేపల వేట సాగిస్తున్న సమయంలో, పడవ మరమ్మతులకు గురైన భారత్ సరిహద్దుల్లో ప్రవేశించింది. సమాచారం అందుకున్న కోస్ట్‌గార్డ్, ధనుష్కోటికి చేరుకున్న పడవలో ఉన్న జూలియస్ జీట్, ఆంటోని అనే ఇద్దరు జాలర్లను అరెస్ట్ చేశారు.

వలస కార్మికుల జీవన చిత్రం 'రైల్'


'రైల్'లో ఓ దృశ్యం

ఉత్తరాది వలస కార్మికుల జీవన చిత్రాన్ని తెలిపే సినిమాగా రైల్‌ను దర్శకుడు భాస్కర్ శక్తి తెరకెక్కించారు. శుక్రవారం విడుదలైన ఈ చిత్రంలో కుంకుమ్ రాజ్, పర్వేజ్ మెహ్రా ప్రధాన పాత్రలను పోషించారు. ఇందులో పల్లెటూరి జీవితాన్ని, అక్కడి ప్రజల వాస్తవికతకు దగ్గరగా చూపించారు. ఉపాధి కోసం ఉత్తరాది నుంచి రాష్ట్రానికి వచ్చే వలస కార్మికులు, స్థానిక ప్రజల మనోభావాలపై అధిక దృష్టిని కేంద్రీకరించకుండా ఇతర అంశాలపై శ్రద్ధ చూపించి, కథను పక్కదారి పట్టించారు. ఉత్తరాది కార్మికులను, ప్రజలను మంచివారిగా చిత్రీకరించాలనే దర్శకుడి ఆలోచన మెచ్చుకోదగినదే అయినప్పటికీ కార్మికుల భావోద్వేగాలను, స్థానిక ప్రజల ఆలోచనలను సమతూకంతో తెరకెక్కించడంలో దర్శకుడు విఫలమయ్యారు. ప్రజల ఆర్థిక స్థితిగతులు, వారి మనోభావాలు, వలస మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్ళు ప్రజల సమస్యలు, స్థానికులపై మద్యపానం ఏ విధంగా ప్రభావం చూపుతుందన్న అంశాలను దర్శకుడు వైవిధ్య భరితంగా చూపించారు. మద్యపానం వల్ల ఛిద్రమైన కుటుంబం, ఆర్థిక కష్టాలు, దుబాయ్ నుంచి స్వదేశానికి వచ్చిన వ్యక్తి ఇతరులను మోసం చేయడం, వలస కార్మికుల ఆందోళన, అనుకోని సమస్యలు, చుట్టుపక్కల వాతావరణం, కొన్ని ఎమోషనల్ సన్నివేశాలకు రెడ్ సిగ్నల్ లేకుండా సాగిపోవడం ప్రేక్షకుడికి బోర్ తెప్పించేవిగా ఉన్నాయి. ఇందులో హీరో కుంకుమ్‌రాజ్ 'ముత్తయ్య' పాత్రలో జీవించగా, పొరుగింటిలో నివసించే వ్యక్తిగా, పర్వేజ్ మెహ్రా పోటీపడి నటించారు. ఇతర పాత్రలను వైరమాల, రమేష్ వైద్య, షమీరా, వైరమ్ పట్టి, వందన పోషించారు. తేని ఈశ్వర్ కెమెరా పనితనం బాగుంది. నిర్మాత ఎం.వేడియప్పన్ నిర్మించిన ఈ చిత్రం అనేక సమస్యలను అధికమించి విడుదలై పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది.

సంతానం సరసన మీనాక్షి చౌదరి?


మీనాక్షి చౌదరి

హాస్య నటుడు సంతానం హీరోగా నటించే కొత్త చిత్రంలో హీరోయిన్‌గా మీనాక్షి చౌదరి నటించనున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. లొల్లుసభ ఫేం రాంబాలా దర్శకత్వం వహిస్తున్నారు. పూర్తి హాస్యభరిత చిత్రంగా తెరకెక్కించిన 'దిల్లుకు దుడ్డు' చిత్రం రెండు భాగాలుగా రాంబాలా తెరకెక్కించారు. గత యేడాది 'డిడి రిటర్న్స్' పేరుతో మూడో భాగాన్ని రిలీజ్ చేయగా, రాంబాలా వద్ద సహాయ దర్శకుడిగా పనిచేసిన ప్రేమ్ ఆనంద్ దర్శకత్వం వహించారు. ఇపుడు 'డిడి రిటర్న్స్' మూడో భాగానికి రాంబాలా దర్శకత్వం వహించనున్నారు. హీరో ఆర్య ఆ చిత్రానికి నిర్మాత. ఇందులో మీనాక్షి చౌదరిని హీరోయిన్‌గా ఎంపిక చేశారు. ప్రస్తుతం ఆమె విజయ్ సరసన 'ది గోట్' చిత్రంలో నటిస్తున్న విషయం తెల్సిందే.

నేడు సూపర్ సింగర్ సీజన్-10 ఫైనల్

ప్రముఖ టీవీలో గత కొన్ని రోజులుగా ప్రసారమవుతున్న సూపర్ సింగర్ సీజన్-10 కార్యక్రమంలో భాగంగా ఫైనల్ ఈనెల 23న ఆదివారం చెన్నైలో జరగనుంది. స్థానిక నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరిగే ఈ పోటీలను టీవీలో లైవ్ టెలికాస్ట్ చేయనున్నారు. ఈ సీజన్‌లో తుది పోరుకు జాన్ జెరోమ్, విఘ్నేష్, జీవిత, వైష్ణవి, శ్రీనిధి రామకృష్ణన్ ఎంపికయ్యారు. ఈ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచే విజేతకు రూ.60 లక్షలు, రెండో విజేతకు రూ.10 లక్షల నగదు బహుమతిని ప్రదానం చేయనున్నారు. సీజన్ ఫైనల్ పోటీలకు సినీ నేపథ్యగాయకులు మనో, సుజాత, అనురాధ శ్రీరామ్, సంగీత దర్శకుడు షాన్ రోల్డన్ న్యాయనిర్ణేతలుగాను, ఆనంద్, ప్రియాంక దేశ్‌పాండే వ్యాఖ్యాతలుగా వ్యవహరించనున్నారు.


మనో, సుజాత, అనురాధా శ్రీరామ్ తదితరులు

యోగిబాబుతో 'చట్నీ సాంబర్' వెబ్ సిరీస్



'చట్నీ సాంబార్'లో ఓ దృశ్యం

తమిళ చిత్రపరిశ్రమలో ప్రముఖ హాస్యనటుడుగా ఉన్న యోగిబాబు ప్రధాన పాత్రలో 'చట్నీ సాంబార్' పేరుతో వెబ్ సిరీస్ తెరకెక్కుతోంది. ఆయనతో పాటు వాణి భోజన్, కయల్ చంద్రన్, నితిన్ సత్య, దీపా శంకర్, సంయుక్త విశ్వనాథ్, సుందర్ రాజన్ తదితరులు ఇతర పాత్రలను పోషించారు. హాయిగా సాగిపోయే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ వెబ్ సిరీస్‌గా రూపొందిస్తున్నారు. ఈ వెబ్ సిరీస్ ఫస్ట్‌లుక్‌ను నిర్మాణ సంస్థ డిస్నీ హాట్ స్టార్ తాజాగా విడుదల చేయగా, రాధా మోహన్ దర్శకత్వం వహించారు. యోగిబాబు ఒకవైపు హీరోగా నటిస్తూనే మరోవైపు హాస్య నటుడుగా నటిస్తూ ప్రేక్షకులను కడుపుబ్బ నవ్విస్తున్నారు. ఆ కోవలోనే రజనీకాంత్ 'జైలర్', షారూక్ ఖాన్ 'జవాన్' వంటి భారీ హిట్ చిత్రాల్లో నటించారు.

ఐటీ జాబ్‌కు స్వస్తి చెప్పి...

- ఇత్తడితో కళాత్మక వస్తువుల వ్యాపారం

SUNDAY SPECIAL


దేవతామూర్తి విగ్రహంతో గణపతి



పూజా సామగ్రి అంటేనే అందరికీ వెంటనే గుర్తుకు వచ్చేది ఇత్తడి కళాత్మక వస్తువులే! పూజ గదిలోని దేవతామూర్తుల విగ్రహాలు, గంట, హారతి పళ్లెం, పన్నీటి చెంబు, పంచపాత్ర, ధూపకలశం.. ఇలా అన్నీ ఇత్తడితో తయారు చేసినవే. తమిళులంతా తమ పూజాగదిలో ఇత్తడితో తయారు చేసిన కామాక్షిదీపాన్ని పెట్టుకుని పూజించడం ఆనవాయితీ. ఇత్తడి వస్తువులున్న ఇల్లు సుభిక్షంగా ఉంటుందని పెద్దలు చెబుతారు. ఇలాంటి ఇత్తడి కళాత్మక వస్తువులపై చిన్ననాటి నుంచి ఆసక్తి పెంచుకున్న అంబత్తూరుకు చెందిన గణపతి అనే యువకుడు లక్షల జీతం వచ్చే ఐటీ ఉద్యోగానికి రాజీనామా చేసి ఇత్తడి వస్తువుల వ్యాపారం ప్రారంభించాడు. అంబత్తూరు వద్దే చిన్న దుకాణాన్ని తెరిచాడు. 'మగిళ్ హాండీక్రాఫ్ట్స్' పేరుతో చిన్నగదిలో ప్రారంభించిన ఆ వ్యాపారం పుంజుకోవడంతో చెన్నైలోని కొట్టివాక్కంలో శాఖను ప్రారంభించారు. ఐదేళ్లుగా ఇత్తడి పూజా సామగ్రిని విక్రయిస్తూ వినియోగదారులనుంచి మంచి పేరు సంపాదించుకున్నాడు. - చెన్నై, ఆంధ్రజ్యోతి




కొట్టివాక్కం షాపు ముందున్న వేంకటేశ్వరస్వామి విగ్రహం

బాల్యం నుంచే...



పీజీ చదివి ఐటీ జాబ్ చేస్తూ వచ్చిన గణపతికి బాల్యంలో ఇత్తడి కళాత్మక వస్తువులంటే ఆసక్తి ఏర్పడింది. అప్పటి నుండే ఇత్తడి కళాత్మక వస్తువులు, చిన్న సైజు దేవతామూర్తుల విగ్రహాలను కూడా సేకరించేవాడు. ఎక్కడైనా కళాత్మకమైన దేవుడి విగ్రహాలు ఉన్నాయని సమాచారం తెలిస్తే అక్కడికి వెళ్లి నచ్చిన విగ్రహాలను కొనుక్కుని వచ్చేవాడు. వాటిని భద్రంగా దాచిపెట్టేవాడు. అతడు సేకరించిన ఇత్తడి కళాత్మక వస్తువులను చూసిన స్నేహితులు, ఇంటి చుట్టుపక్కలివారు వాటిని కొనేందుకు ఆసక్తి కనబరిచేవారు. తొలుత వాటిని విక్రయించేందుకు గణపతి ఇష్టపడలేదు. ఆ తర్వాత స్నేహితులు ఒత్తిడి చేయడంతో వాటిని విక్రయించే వాడు.

ఐటీ ఉద్యోగానికి రాజీనామా...

ఐటీ జాబ్ చేస్తూనే మరో వైపు ఇతర రాష్ట్రాలలోని అరుదైన ఇత్తడి కళాత్మక వస్తువులను, దేవతామూర్తుల విగ్రహాలను కొనుగోలు చేసేవాడు. వాటిని ఇళ్లవద్దకు తెచ్చి విక్రయించే వాడు. రోజురోజుకూ ఇత్తడి వస్తువులు కొనేందుకు ఇంటికి వచ్చే కస్టమర్ల సంఖ్య పెరగటంతో ఉద్యోగానికి స్వస్తి పలకాలనుకున్నాడు. ఆలోచన వచ్చిందే తడవుగా ఉద్యోగానికి రాజీనామా చేసి ఇత్తడి కళాత్మక వస్తువుల దుకాణం తెరిచాడు. ప్రారంభంలో ఇత్తడి కళాత్మక వస్తువులనే విక్రయించిన గణపతి ఆ తర్వాత రాగి, టెర్రకోట, కొయ్యతో తయారు చేసిన దేవతా మూర్తులు విగ్రహాలను కూడా అమ్మకానికి ఉంచాడు. అయితే ఇత్తడి వస్తువులే అధికంగా అమ్ముడు కావటంతో ఆ వస్తువులపైనే దృష్టి సారించాడు. కొట్టివాక్కంలో తెరచిన దుకాణం నగరవాసులను బాగా ఆకట్టుకుంది. దుకాణం ప్రవేశద్వారం వద్ద చెట్టినాడు స్తంభాల నడుమ ఆరడుగుల ఎత్తున్న శ్రీవేంకటేశ్వరస్వామివారి విగ్రహం కనువిందు చేస్తోంది. బ్రహ్మ, విష్ణువు, పరమేశ్వరుడు, వినాయకుడు, మురుగన్, హనుమాన్ విగ్రహాలు కొట్టివాక్కం దుకాణంలో ఎక్కువగా అమ్ముడవుతుంది. ప్రతి దేవతామూర్తిని వివిధ భంగిమలలో ఇత్తడి విగ్రహాలను హస్తకళాకారులచే తయారు చేయించి, దుకాణంలో ఉంచడంతో కస్టమర్లు పోటీ పడి వాటిని కొనుగోలు చేస్తున్నారు. పూజగది సామగ్రితోపాటు దేవతామూర్తుల విగ్రహాలు, దేవతామూర్తుల ఆకారాలున్న చేతి కడియాలు కూడా ఎక్కువగా విక్రయిస్తున్నారు.





ఇతర ప్రాంతాలకు వెళ్లి...



వెరైటీ వస్తువుల తయారీ కోసం గణపతి తరచూ బెంగళూరు, డిల్లీ, కోల్‌కాతా తదితర నగరాలకు వెళ్లి అక్కడ అధికంగా విక్రయించే పూజా సామగ్రిని, యువతీ యువకులు . చేతికి ధరించే కడియాలను పరిశీలించి అలాంటి మోడళ్లతో స్థానికంగా ఆ వస్తువులను తయారు చేసి విక్రయిస్తున్నాడు. ప్రస్తుతం గణపతి నడుపుతున్న దుకాణాలలో పూజా సామగ్రితోపాటు, దేవతా మూర్తుల విగ్రహాలు కూడా అధికంగా విక్రయిస్తున్నారు. ఐదేళ్లలో ఇత్తడి వస్తువుల వ్యాపారం బాగా పుంజుకోవడంతో గణపతి పారిశ్రామికవేత్తగా మారాడు. ఐటీ జాబ్ యాంత్రికంగా ఉండేదని, ప్రస్తుతం చిన్నప్పటి నుండి ఇత్తడి వస్తువులపై ఉన్న ఆసక్తి కారణంగా ప్రారంభించిన ఇత్తడి హస్తకళాత్మక వస్తువుల వ్యాపారం సంతృప్తి ఇస్తోందని గణపతి చెబుతున్నారు.




విక్రయానికి సిద్ధంగా ఉన్న కళాత్మక వస్తువులు


కార్నివాల్‌లో పాల్గొన్న చిన్నారులతో సుధా షా, నిర్వాహకులు

మద్రాస్ వెస్ట్ రౌండ్ టేబుల్ ఆధ్వర్యంలో యునిఫైడ్ స్పెషల్ కార్నివాల్

అడయార్, జూన్ 22: ది మద్రాస్ వెస్ట్ రౌండ్ టేబుల్ 10 ఆధ్వర్యంలో యూనిఫైడ్ స్పెషల్ కార్నివాల్‌ను ఆసక్తికరంగా నిర్వహించారు. ఇందులో భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ సుధా షా పాల్గొని దివ్యాంగ చిన్నారుల్లో స్ఫూర్తిని నింపే ప్రయత్నం చేశారు. ఈ కార్నివాల్‌లో దాదాపు 1000 మందికిపైగా చిన్నారులు పాల్గొన్నారు. స్థానిక ఐసీఎఫ్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ కార్నివాల్‌లో వివిధ రకాల ఆటలు, సంగీత పోటీలను నిర్వహించడంతో పాటు రుచికరమైన భోజనాన్ని వడ్డించారు. కాగా, గత 1996 నుంచి ప్రారంభమైన ఈ కార్నివాల్... ఇపుడు 28వ యేటలోకి అడుగుపెట్టింది. ది మద్రాస్ వెస్ట్ రౌండ్ టేబుల్ 10 దేశంలో కమ్యూనిటీ ప్రాజెక్టులను నిర్వహించడంలో కీలక భూమికను పోషిస్తుంది.

మహిళల కోసం చెన్నైలో 'పింక్' ఆటోలు



చెన్నై, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలో మహిళలకు మరింత భద్రత కల్పించే దిశగా 'పింక్' ఆటోలను ప్రవేశపెట్టనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి గీతా జీవన్ ప్రకటించారు. శాసనసభలో తన శాఖకు సంబంధించిన ఆర్థిక పద్దులపై జరిగిన చర్చలలో పాల్గొని ఆమె మాట్లాడుతూ... నగరమంతటా 200 మంది మహిళా ఆటో డ్రైవర్లను ఎంపిక చేసి వారికి తలా లక్ష రూపాయల చొప్పున ప్రభుత్వం సబ్సిడీ అందజేయనున్నదని తెలిపారు. రూ.2 కోట్లతో నగరంలో ఈ పింక్ ఆటోలు నడుపనున్నామని చెప్పారు. ఆడ శిశువులకు సంబంధించి ప్రభుత్వ సంక్షేమ పథకాలలో లబ్ధి పొందే విధంగా వార్షిక ఆదాయ పరిమితిని రూ.72వేల నుంచి రూ.1.20లక్షలకు పెంచనున్నట్లు ఆమె తెలిపారు.

20 అడుగులు వెనక్కి తగ్గిన సముద్రం

ఐసిఎఫ్, జూన్ 22: తిరుచెందూర్‌లో శనివారం 20 అడుగుల వెనక్కు సముద్రం వెళ్లింది. సుబ్రమణ్యస్వామి ఆరు దివ్యక్షేత్రాల్లో రెండోదైన తిరుచెందూర్ ఆలయాన్ని ప్రతిరోజు అనేకమంది భక్తులు దర్శనం చేసుకొని వెళుతుంటారు. శుక్రవారం పౌర్ణమి కావడంతో వేకువజామున 4 గంటలకు ఆలయాన్ని తెరచి పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచే వేల సంఖ్యలో భక్తులు ఆలయానికి పోటెత్తారు. భక్తులు తిరుచెందూర్ సముద్రం, నాళికినరుల్లో పుణ్యస్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ నేపథ్యంలో, శనివారం ఉదయం భక్తులు స్నానం చేస్తుండగా సముద్రం హఠాత్తుగా 20 అడుగులు వెనక్కి వెళ్లింది. దీంతో, అందులో ఉన్న బండరాళ్లు బయటపడ్డాయి. ప్రజలు, భక్తులు ఆ రాళ్లపై నిల్చొని సెల్ఫీలు తీసుకున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న అధికారులు, పోలీసులు భద్రతా దృష్ట్యా అక్కడకు వెళ్లరాదని ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు.



తిరుచెందూర్ ఆలయంలో వైభవంగా పౌర్ణమి పూజలు

- పోటెత్తిన భక్తులు

ప్యారీస్, జూన్ 22: తూత్తుకుడి జిల్లా తిరుచెందూర్ బంగాళాఖాతం తీరంలో సుబ్రమణ్యస్వామి ఆరుపడై వీడులో రెండోదిగా ప్రసిద్ధిచెందిన సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో నిర్వహించిన పౌర్ణమి పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. శూర సంహారం వేడుకలకు ప్రసిద్ధిగాంచిన ఈ క్షేత్రంలో సెలవు రోజులు, పండుగ రోజులు, పౌర్ణమి రోజుల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని, వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామిని దర్శించుకుంటారు. ఈ ఏడాది ఆణి మాసం పౌర్ణమి పూజలను శుక్ర, శనివారాల్లో శాస్త్రోక్తంగా నిర్వహించారు. రేయనక, పగలనక చూడకుండా భక్తులు తరలివెళ్లి క్యూలైన్లలో వేచి ఉండి దర్శనం చేసుకుంటున్నారు. ఆలయ ప్రాంగణం, సముద్రతీరం, నాళికినరు సహా ప్రధాన వీధులు భక్తులతో కిటకిటలాడుతున్నాయి.



బీచ్- చెంగల్పట్టు మార్గంలో త్వరలో ఏసీ స్పెషల్ లోకల్ రైలు

చెన్నై, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): బీచ్ - చెంగల్పట్టు మార్గంలో ఏసీ లోకల్ రైళ్లను నడిపేందుకు దక్షిణ రైల్వే అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఈ రైలును పెరంబూరులో ఐసీఎఫ్‌లోనూ తయారు చేస్తున్నారు. వేసవిలో సాధారణ విద్యుత్ లోకల్ రైళ్లలో వెళ్లే ఉద్యోగులు, వ్యాపారులు, కార్మికులు చెమటతో తడిసిపోతుంటారు. ఉదయం , సాయంత్రం వేళల్లో ఈ రైళ్లలో మూడింతల మంది ప్రయాణికులు ప్రయాణిస్తుంటారు. ఇలాంటి ఇబ్బందులను తొలగించే నిమిత్తం దేశంలోని ప్రముఖ నగరాలలో విద్యుత్ లోకల్ రైళ్లు నడిచే మార్గాలలో మెట్రోరైలు తరహాలో పూర్తిగా ఏసీ సదుపాయంతో కూడిన రైళ్లను నడపాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఆ మేరకే ఐసీఎఫ్‌లో ప్రస్తుతం ఎనిమిది ప్రత్యేక ఏసీ విద్యుత్ రైళ్లను తయారు చేస్తున్నారు. ఈ రైళ్లలో రెండు ఏసీ రైళ్లను చెన్నై సబర్బన్ మార్గాలలో నడిపేందుకు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. తొలుత ఈ ఏసీ స్పెషల్ విద్యుత్ లోకల్ రైలును బీచ్- చెంగల్పట్టు మార్గంలో రద్దీ అధికంగా ఉండే ఉదయం, సాయంత్రం వేళల్లో నడుపనున్నామని పేర్కొన్నారు. అయితే ఈ ఏసీ స్పెషల్ విద్యుత్ లోకల్ రైలులో ఎంత ఛార్జీలుగా వసూలు చేస్తారనే విషయంపై అధికారులు ఎలాంటి ప్రకటన చేయలేదు.


ఐసీఎఫ్‌లో తయారవుతున్న ఏసీ స్పెషల్ లోకల్ రైలు